17వ సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,27 డిశంబర్ 2023


# క్రీడలతో మానసిక ఉల్లాసం - ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** క్రీడల వల్ల ప్రతి ఒక్కరిలోనూ మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం లొల్ల గ్రామంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను లాంచనంగా ప్రారంభించారు. ఆత్రేయపురం గ్రామంలో మహాత్మాగాంధీ జూనియర్ కాలేజి వద్ద జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీపీ కుండా అన్నపూర్ణ, ఆప్కాస్ డైరక్టర్ కప్పల శ్రీధర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, కో-ఆప్షన్ మెంబర్ పల్నాటి సామ్యుల్ రెడ్డి జయపాల్ పాల్గొని ఆటల పోటీలు ప్రారంబించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ నాతి బుజ్జి, ఈఓపిఆర్డి డి.శ్రీనివాసరావు, పరిపాలనాదికారి, టి.వి.సురేంద్ర రెడ్డి, యంపిటిసి సభ్యులు తూము రామకృష్ణ, చక్రధర, కాశీ విశ్వనాథం, వాడపల్లి సర్పంచ్ పోచిరాజు సూర్యకుమారి బాబూరావు, ఆత్రేయపురం పి.ఇ.టి. ఎన్.రవిరాజు, వై.శ్రీనివాసరావు, అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రామ సర్పంచులు, యం.పి.టి.సి. సభ్యులు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టిందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదన్నారు. ప్రస్తుతం యువతలో ఫిజికల్ ఫిట్నెస్ సరిగా ఉండటం లేనందున ఆడుదాం ఆంధ్రా యువతకు మంచి అవకాశం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, కె.కృష్ణ, సమీర్ వల్లి, జె.శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తారా?





## - ఆర్ అండ్ ఆర్ కార్యాలయం ఎదుట నిర్వాసితులు ఆందోళన

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టులో భాగంగా సర్వం కోల్పోయిన నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసినట్లు తెలిపారు. పోలవరం అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను దేవీపట్నం నిర్వాసితులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా సర్వం కోల్పోయిన దేవీపట్నం గ్రామానికి గత మూడు సంవత్సరాలుగా కనీసం ఇళ్ళ నిర్మాణం కూడా చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అధికారులను దవలేశ్వరం ఆర్ అండ్ ఆర్ ఆఫీస్‌లో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్యను కలవడానికి వెళ్లిన నిర్వాసితులు వెళ్లారు. ఈ విధంగా వెళ్లిన ప్రతీసారి ఏదో ఒక కారణం చెప్పి వెనక్కి పంపించడం జరుగుతుంది.

ఈసారి విసిగిపోయిన నిర్వాసితులు ఆఫీస్ ఎదుట కూర్చుని నినాదాలు చేశారు. వెంటనే స్పందించిన పోలవరం అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య కాన్ఫరెన్స్ హాల్లోకి నిర్వాసితులందరిని రమ్మని వారితో మాట్లాడటం జరిగింది. నిర్వాసితులందరూ గోకవరంలో గంగాలమ్మ గుడి వెనక నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ పనులు నిలుపుదల చేసిన సంబంధిత అధికారులను నిలదీశారు. గత మూడు సంవత్సరాల నుండి ఎన్నో బాధలు పడుతున్నామని, అద్దె ఇళ్లలో సుమారు మూడు సంవత్సరాల నుంచి నెలకి వేల రూపాయలు అద్దెలు చెల్లించుకుంటున్నామని, ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అద్దెలకు సరిపోయిందని నిర్వాసితులు వాపోయారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ దేవీపట్నం కాలనీ పనులు వెంటనే మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని, అలాగే ముఖ్యమంత్రి ప్రకటించిన పది లక్షల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ముందుగా దేవీపట్నం గ్రామానికి మిగిలిన మూడు లక్షల అరవై నాలుగు వేల రూపాయలు వేయడానికి సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన బడ్జెట్ రెడీగా ఉందని, బుధవారం కాంట్రాక్టర్‌తో మీటింగ్ ఏర్పాటు చేసి నిలిపివేసిన పనులను వెంటనే మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సెకండ్ లిస్ట్‌లో ఉన్న పేర్లకు సంబంధించి వచ్చేనెల 2 నుండి 7 వ తేదీ లోపు గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితాను ఉంచుతామని, అలాగే సొంతంగా నిర్మించుకుంటామన్నా ఇళ్లకు ఇసుక కూపన్‌లు ఇస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు శాంతించారు.

# భూహక్కు చట్టం -2023 రద్దు చేయాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** భూహక్కు చట్టం 2023 రద్దు చేయాలని, రంపచోడవరం కేంద్రంలో ఉన్న గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తొలగించాలని ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టం-2023 (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) ని తక్షణమే రద్దు చేయాలని, రంపచోడవరం కేంద్రంలో ఉన్న గిరిజనేతరుల అక్రమ కట్టడాలు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. రంపచోడవరం లో జరిగిన అత్యవసర సమావేశంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టం 2023 (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్)ఈ చట్టాన్ని జీవో నెంబర్ 512 ని జారీ చేసి ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించటంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అమలు జరపడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవిన్యూ అధికారులకు ల్యాండ్ టైటిల్ని ఇచ్చే అధికారం ఇచ్చిందన్నారు. ఈ విధానం వలన నిజమైన లబ్ధిదారుడు నష్టపోయే అవకాశం ఉందన్నారు. కాబట్టి భూహక్కు చట్టం 2023, జీవో నెంబర్ 512ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు నేడు గుర్తింపును కోల్పోతే రేపటికి హక్కులు కోల్పోతారన్నారు. కాబట్టి ఆదివాసీ తెగలు ఉనికి, అస్తిత్వం, సంస్కృతి, హక్కులు, చట్టాలు కాపాడవలసిన బాధ్యత నేటి తరం యువతీయువకులు, విద్యార్థులపై ఉందన్నారు. అలాగే రంపచోడవరం మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బిఐ పక్కన ఉన్న ప్రభుత్వ ఐటీడీఏ స్థలం వద్ద అక్రమంగా గిరిజనేతరులు షాపు నిర్మాణం చేపట్టారని, దాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న స్థలంలో గిరిజనేతరులు అక్రమంగా స్థలం ఆక్రమించి ప్రస్తుతం సాపు నిర్మాణం జరుగుతుందన్నారు. రంపచోడవరంలో అంబేద్కర్ సెంటర్లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల చుట్టు ఉన్న వ్యాపార దుకాణాలు తొలగించాలని, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు రంగులు వేయాలని, విగ్రహాల చుట్టూ ఉన్న చెత్తా చెదారం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని రంపచోడవరంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే కలిసి, వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కుండ్ల కృష్ణరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు ముర్ల బాలురెడ్డి, సిహెచ్.చిలకారెడ్డి, ముర్ల బాబులురెడ్డి, సిహెచ్.కోదండరామ్, సిహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఐదో రోజు వికసిత్ భారత్ సంకల్పయాత్ర



**చింతూరు మేజర్ న్యూస్ :** వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఐదవ రోజు కుమ్మూర్, గంగన్న మెట్ట గ్రామపంచాయతీ నిర్వహించడం జరిగింది. నాలుగు మండలాల వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చింతూరు మండల అధ్యక్షులు చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ యొక్క వికసిత్ భారత సంకల్పయాత్రకు ముఖ్య అతిథులుగా చింతూరు మండల వ్యవసాయ అధికారి దేవరకొండ శ్రీనివాసరావు, ఏపిఎం నాయుడు హాజరయ్యారు. మోడీ అధికారంలో వచ్చినప్పటినుండి గ్రామపంచాయతీలకు సుమారుగా వందకి 90 రూపాయలు కేంద్ర ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. పిఎం కిసాన్ అర్హులైనటువంటి సుమారుగా 500 మంది రైతులకు సంవత్సరానికి ఆరువేల రూపాయలు చొప్పున కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నుంచి సహాయం అందించడం జరుగుతుంది.స్వచ్ఛభారత్ ద్వారా ప్రతి గ్రామంలో అర్హులైనటువంటి ప్రతి ఒక్కరికి మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు.

## ఘనంగా వంగవీటి మోహన్ రంగ 43వ వర్ధంతి



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని మంగళవారం వంగవీటి మోహన్‌రంగా 43వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ వద్ద వంగవీటి మోహన్ రంగ బ్యానరును ఆవిష్కరించారు. ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం చింతూరు గవర్నమెంట్ ఆసుపత్రిలో రోజులకు పండ్లు పంచారు. ఈ సందర్భంగా క్రికెట్ గ్రౌండ్లో స్టేజి ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సింగంశెట్టి దుర్గారావు, హరీష్ నాయుడు, రియాజ్, గణేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్య దేవుని హుండీల ఆదాయం 26 రోజులకు రూ.2,07,80,492లు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో కుండీలు లెక్కింపు నిర్వహించగా శ్రీ సత్య దేవుని హుండీల ఆదాయం రూ.2,07,80,492.00లు, యూఎస్ఏ డాలర్లు 378, ఆస్ట్రేలియా డాలర్స్ 50, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమెన్ రియల్స్ 100, బ్యాంక్ నగర్ మలేషియా ఆర్యమ్ 100, సౌదీ అరేబియా రియల్స్ 1, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పౌండ్స్ 10, సెంట్రల్ బ్యాంక్ నిటర్ ఎమిరేట్స్ దినర్ 95, బంగారం 32 గ్రాములు, వెండి 1 కేజీ 85 గ్రాములు లభ్యమయ్యాయని దేవస్థానం అధికారులు తెలియజేశారు.

ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్, దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్, ఏసీ రమేష్ బాబు మరియు దేవస్థాన అధికారులు, సిబ్బంది, వ్రత పురోహితులు,అర్చకులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# విలీన మండలాల ప్రజలు విన్నపాలు



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ అనంత బాబుకి, ఎమ్మెల్యే ధనలక్ష్మికి, నాలుగు మండలాల నిర్వాసితుల తరుపున,మామిడి రాజు,మామిడి వెంకటేశ్వరరావు, వ్రాయునది ఏమనగా? 2004,లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి అయిన తరువాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం శంఖుస్థాపన చేశారు.దానివల్ల ఈప్రాంతం అంతా! మునిగి పోతుందని తెలిసినప్పుడు మాప్రాంత వాసులు పడిన బాధ అంతా ఇంతా కాదు!ఎంతో మంది నిద్రలేని రాత్రులు గడిపారు. నిర్వాసితుల బాధను అర్థం చేసుకొన్న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, మీకు మెరుగైన ప్యాకేజీ మరియు భూపరిహారం ఇస్తాను.మీకు న్యాయంచేస్తానని హామీ ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నాం. నిజంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వుండి వుంటే తప్పకుండాన్యాయం జరిగేదని గట్టి నమ్మకంతో ఉన్నారు. దురదృష్ట వశాత్తూ! ఆయన మరణించడం అత్యంత బాధాకరం.తరువాత వచ్చిన ముఖ్యమంత్రి రోశయ్య, కానీ కిరణ్ కుమార్ రెడ్డి, కానీ దీనిపై దృష్టి పెట్టలేదు. 2014లో నారా చంద్రబాబు నాయుడు,ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత 2013 "భూసేకరణ చట్టం" అమలులోకి వచ్చి ఎకరానికి 10,50,000/- గా నిర్ణయించి కుక్కునూరు, మరియూ వేలేరుపాడు, మండలాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి, వారికి భూనష్టపరిహారం ఇచ్చారు. మమ్మల్ని నిర్లక్ష్యం చేశారు.2007,2008 లో భూములకు నష్ట పరిహారం1,15,000/- తీసుకొన్న రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని,కలిసి మాకు న్యాయం చేయండి అని అడిగినా స్పందించ లేదు!2019లో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చారు. చాలా సంతోష పడ్డాం. ఎన్నికలముందు రేఖపల్లిలో జరగిన బహిరంగసభలో రైతులు జగన్మోహన్ రెడ్డికి, విన్నవించుకోగా! మన ప్రభుత్వం అధికారం లోకి వస్తే అదనంగా ఎకరానికి 5,00,000/- ఇస్తానని హామీ ఇచ్చారు. చాలాసంతోషపడ్డాం.అలాగే మిగిలిన భూముల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి మూడు సంవత్సరాలు కావస్తోంది. సర్వేలు కూడా పూర్తి అయినవి. కానీ పరిహారం రాలేదు.ఆర్&ఆర్ కుడా కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలని అందరు ఎదురు చూస్తున్నారు.మా అభిమాన నాయకులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, లాగానే వారి బిడ్డ,ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, న్యాయం చేస్తారనిఎదురు చూస్తున్నాం. మీరు,మాప్రాంతంమీద చూపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటిఫికేషన్ కంటే ముందు మా సమస్యలను,ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తారని, మీరు తలుచుకుంటే తప్పకుండా చేయగలరని మాకు మీపై అపారమైన విశ్వాసం ఉంది..ఇది నాఒక్కడి అభిప్రాయం కాదు. రంపచోడవరం మరియు పోలవరం నియోజకవర్గాల ముంపు మండలాల్లోని నిర్వాసితుల అభిప్రాయం.కావున మా విన్నపాన్ని మన్నించి న్యాయం చేస్తారనిఆశిస్తున్నాం.రేఖపల్లి2022 వరదల్లో మునిగింది. రేఖపల్లి రైతుల భూములు ముంపులోనే ఉన్నాయి.ప్రజల కష్టాలు,విలీన ప్రజల,బాధలు మీకు తెలుసు.ప్రతీ ఏడాది ఏలా భరించాలి.రైతులు పడే బాధలు,పేదప్రజల ఇబ్బందులు,దారుణంగా ఉన్నాయి.ఇక్కడి ప్రజల బాధలను(ఇబ్బందులను)దృష్టిలో పెట్టుకొని సర్వే చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

# 6వ డివిజన్‌లో జనసేన 'ప్రజాచైతన్య పోరాటం' యాత్ర



కాకినాడ, మేజర్ న్యూస్ : జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ సూచనలతో మోర్త రవణమ్మ ఆధ్వర్యంలో 6వ డివిజన్ రాచర్ల వారి వీధి దగ్గర ప్రజా చైతన్య పోరాటం యాత్ర జరిగినది.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రేణులు ప్రజలను కలిసి ఈ వై.సి.పి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి చైతన్యపరిచారు. ఒక జాతి అభివృద్ధి చెందింది అని చెప్పాలంటే వారు నివశిస్తున్న ప్రాంతం రోడ్లు, కాలువలు, వ్యాపారాలు, భవనాలు, పారిశ్రామిక వాడలు వగైరా వగైరా వాటిని బట్టి పరిగణనలోకి తీసుకుంటారనీ, అదేంటో ఈ వై.సి.పి. ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కేసి అభివృద్ధిలో మన రాష్ట్రం టాప్ అంటున్నాడని సభ్య సమాజం, ఇతర రాష్ట్రాల వాళ్ళు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారన్నారు. ఈ నాలుగున్నర ఏండ్ల చరిత్రని పరిశీలిస్తే నీటి ప్రోజక్టుల గేట్లు కొట్టుకొని పోవడం, ఒక ఊరిలో నీటి ప్రోజెక్టు తెగిపోయి ముప్పై మంది కొట్టుకుపోయి మరణించడం, పోలవరం ప్రోజక్టు స్థాయిని పరిమితం చేసి రిజర్వాయిరులాగ చేయడం, రాజధాని లేకుండా చేయడం, ఇలా చెప్పుకుంటూ పోతే అంతం లేదనీ, అసలు ఒక్క నిర్మాణాత్మకమైన పని పూర్తిచేసాం అని చెప్పి ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రానున్న ఎన్నికలకు వెళ్ళగలరా అని ప్రశ్నించారు. ఆఖరుకి ప్రజలు తమ ఓటు జాబితాలో ఉంచుకోడానికి ప్రతి రోజు చెక్ చేసుకోడం చూస్తుంటే ఈ వై.సి.పి. ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేసారు.ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ, పలివేల మార్తా, పి.సోనీ, శిరోకోటి లక్ష్మమ్మ, అవనిగడ్డ మణి, మోర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# 'పేదలకు ఇళ్ళు'కు అరకొరగా ముస్లిం లబ్ధిదారులు



కాకినాడ, మేజర్ న్యూస్ : జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇన్‌ఛార్జ్ ముత్తా శశిధర్ ఆలోచనలతో మంగళవారం 6వ డివిజన్ సాంబమూర్తి నగర్ ప్రాంతంలో జనసేన ముస్లిమ్ సచార్ యాత్ర డాక్టర్ బాబు ఆధ్వర్యంలో జరిగినది.ఈ పాంతంలోని ముస్లిం ప్రజలతో డాక్టర్ బాబు కలిసి సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం వర్గాలు పేదరికం వలన నగరంలో అద్దె ఇళ్ళ భారాన్ని మోయలేక నగర సివార్లలో నివాసాలు ఉంటున్నారనీ, దీనితోడు పిల్లలను స్కూళ్ళకు పంపించకుండా పనిలోకి పంపడం, అసలే ముస్లింలలో అమ్మాయిల చదువులు కోసం బయటకు రావడం తక్కువనీ, ఇలాంటి పరిస్థితుల వల్ల ముస్లింలలో సామాజిక అభివృద్ధి మరింత దిగజారిపోతోందన్నారు. ఈ వై.సి.పి. ప్రభుత్వం ముస్లింలకు అరకొరగా ఇళ్ళ లబ్దిదారులుగా చేసుకున్నారనీ, అవైనా యెక్కడ ఉన్నాయో, ఎప్పటికి చేతికి అందివస్తాయో తెలియని అయోమయ పరిస్థితులలో ఉన్నామని వాపోతున్నారన్నారు. ఈ ముఖ్యమంత్రి పేదల ఇళ్ళ నిర్మాణం కన్నా వాటిని తన కుటిల రాజకీయాలకు ఉపయోగించుకోడంపైనే శ్రద్ధ ఉందన్నారు. జనసేన పార్టీ దీనిని ఖండిస్తోందనీ, ముస్లిం వర్గాల సంక్షేమం మీద ఆలోచన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ మొయినుద్దీన్, షేక్ బషీర్, సయ్యద్ బాజీ, షేక్ బాషా, మదీనా, షాహేదా, కరీమున్నిసా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్‌ల జీవితానుభవం నేటి యువతకు గొప్ప దిక్సూచి



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా కాకినాడ స్థానిక 36వ డివిజన్‌లో సచివాలయ సమీపంలో వృద్ధులను గౌరవించడం కార్యక్రమం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ ఆదేశాల మేరకు సిటి సహాయ కార్యదర్శి వాడ్రేవు లోవరాజు, మిరియాల హైమావతి, చీకట్ల శ్రీనివాస్, సుంకర సురేష్ జనసేన కార్యకర్తలు కలిసి సీనియర్ సిటిజన్ లని గౌరవించడం లో భాగంగా ముమ్మిడి వెంకట్రావు గారిని ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా వాడ్రేవ్ సహాయ కార్యదర్శి లోవరాజు మాట్లాడుతూ ముత్తా శశిధర్ ఆదేశాల మేరకు 92 మంది సీనియర్ సిటిజన్‌లను గౌరవించి వారి సలహాలు సూచనలు పవన్ కళ్యాణ్ కి పోస్ట్ రూపంలో లెటర్ రాసి పంపాలని సీనియర్ సిటిజన్లను కోరామని తెలిపారు. వీరమహిళ మిరియాల హైమావతి మాట్లా డుతూ వృద్ధులను గౌరవించుకోవడం, వారి అనుభవాలను పంచు కోవడం ఒక మంచి అనుభూతి అని, వారి జీవితానుభవం నేటి యువతకు గొప్ప దిక్సూచి అని తెలిపారు. చీకట్ల శ్రీనివాస్ మాట్లా డుతూ సమాజానికి సీనియర్ సిటిజన్లు ఒక పెద్ద దిక్కు అని గత చరిత్రకి వారే సజీవసాక్షులే కాక మార్గదర్శులుకూడా అని తెలిపారు.

## పట్టాలు ఇచ్చిన ప్రతిఒక్కరికి ఇళ్ళ స్థలాలు ఇస్తాం

**- ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఇళ్ల పట్టాలు అందించిన ప్రతీ ఆడపడుచుకి స్థలాన్ని చూపించి వారి సొంతింటి కలను నెరవేర్చి చూపిస్తామని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం లొల్ల, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాలకు చెందిన 299 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రాష్ట్రంలో సొంత ఇల్లు లేనివారు ఎవరూ ఉండకూడదనే దృఢ సంకల్పంతో 30 లక్షలకు పైగా లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు అందచేసారని, నియోజకవర్గంలో 17 వేలకు పైనే లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందించామని, ఇప్పటికే దేవరపల్లి, ఆలమూరు, తాడిపూడి, అవిడి, పెదపళ్ళ, పినపళ్ళ, గుమ్మిలేరు, గోపాలపురం, ర్యాలి, ఈతకోట, పలివెల, వానపల్లి, జొన్నాడ తదితర గ్రామాలలో ఇండ్ల స్థలాలు లబ్ధిదారులకు అందించామని, మిగిలిన ఇండ్ల స్థలాలు కూడా అందరికీ అందిస్తామని, అండగా ఉండి, వచ్చే ఎన్నికలలో ప్రతిపక్షాలకు మరలా తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

## వంగవీటి రంగా యూత్ ఆధ్వర్యంలో రంగా వర్ధంతి వేడుకలు



**ఏలేశ్వరం, మేజర్‌న్యూస్ :** వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా పట్టణంలో స్థానిక వై ఆర్ సి వద్ద రంగా విగ్రహానికి రంగా యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గోపు శ్రీనివాస్ , గట్టెం వెంకట రమణ, రెడ్డి రాజు , అడపా దుర్గారావు, గూడపటి శేఖర్, గోళ్ళ విజయ్, గొల్లపల్లి త్రినాద్ , సఖిరెడ్డి వంశీ కృష్ణ, గంపా చరణ్ వంగవీటి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం
27 డిశంబర్ 2023


## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.40 వేల విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ర్యాలి గ్రామానికి చెందిన బొచ్చుల సుబ్బారావు తండ్రి బొచ్చుల గాంధీ పేరున దేవస్థానం కూడలిలో జగన్మోహిని కేశవస్వామి, ఉమా కమండలేశ్వరస్వామి దేవస్థానం మార్గానికి 20 అడుగుల ఎత్తులో రూ.40 వేలు వ్యయంతో ఐనప ఆర్చ్ గేటును నిర్మించారు. ర్యాలి బ్రిడ్జి వద్ద, మార్కెట్ కూడలిలో కూడా దేవస్థానంనకు మార్గమును తెలుపు ఐరన్ బోర్డులు నిర్మించియున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున దాతకు ఈవో కృష్ణ చైతన్య శాలువా కప్పి, స్వామి వారి ఫొటో అందజేశారు.

## ఆడుదాం ఆంధ్ర సెటిల్ గేమ్



– ప్రారంభించిన స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని
– ఎం.పి.టి.సి.బంధం విజయలక్ష్మి

**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని వరరామచంద్రాపురం, మండల కేంద్రంలోని రేఖపల్లి, ఎస్.బి.ఐ బ్యాంక్ ఆవరణలో "ఆడుదాం ఆంధ్ర" సెటిల్ గ్రౌండ్,వద్ద స్థానిక సర్పంచ్ సరోజిని, ఎం.పి.టి.సి. బంధం విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.డి.ఎస్.సంస్థ చైర్మన్ ఉండవల్లి గాంధీ బాబు, ఎం.పి.డీవో. ఫణీంద్రరెడ్డి, రేఖపల్లి సచివాలయ సెక్రెటరీ శివ ప్రసాద్, సచివాలయ సిబ్బంది,సీనియర్ నాయకులు పంకు సత్తిబాబు, ఆశా వర్కర్లు, తదితర ప్లేయర్స్ పాల్గొన్నారు.

# సురేష్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

– సురేష్ రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాలు పాల్గొన్న ఎమ్మెల్యే



**అనపర్తి, మేజర్ న్యూస్ :** సబ్బెళ్ళ సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని, సురేష్ రెడ్డి ప్రజల హృదయాలలో చిరంజీవిలాచిరస్థాయిగా నిలుస్తాడని అనపర్తి నియోజకవర్గం శాసనసభ్యులు డా.సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి రెండు సంవత్సరాల క్రితం డెంగ్యూ వ్యాధితో మరణించిన విషయం తెలిసిందే.సురేష్‌రెడ్డి ద్వితీయవర్ధంతి సందర్భంగా రామవరం గ్రామంలోని వై ఎస్ ఆర్ మార్గ్ లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్దధాత్రి ట్రస్ట్‌నిర్వహించినకార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ సబ్బెళ్ళ సురేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు అనంతరం సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ దాత్రి దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సుమారు నాలుగు లక్షల రూపాయలు విలువచేసే పదవ తరగతి విద్యార్థులకు 300 స్టడీ మెటీరియల్ బుక్స్, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధునాతన ఆపరేషన్ టేబుల్, పేషంట్ బెడ్స్, ఏసి, వాటర్ కూలర్ లను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో శాసనసభ్యులు డా. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల అభిమానం చూరగున్న సురేష్ రెడ్డి రెండు సంవత్సరాల క్రితం చనిపోవడం అందరిని కలిసివేచిందని ఆ దుఃఖం నుండి చేరుకొని కృష్ణారెడ్డి అతని స్నేహితులు సురేష్ రెడ్డి పేరిట ట్రస్ట్ ప్రారంభించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సురేష్ రెడ్డి మన మధ్యన లేకపోయినా ధాత్రి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలతో ప్రజలలో సురేష్ రెడ్డిని ఎప్పుడు చిరంజీవిగా నిలబడతాయని సురేష్ రెడ్డికి ఉన్న స్నేహితులు సన్నిహితులు అభినందనీయులని సురేష్ రెడ్డి చనిపోయిన సురేష్ రెడ్డి తరఫున సేవా కార్యక్రమాలు తలపెట్టడం స్నేహభావానికి ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర బట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టి రాజు, జడ్పీటీసీ సత్తి గీత వరలక్ష్మి వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ గిరడా గంగా భవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి ,గొలుగూరి గౌతమి, సత్తి దొరారెడ్డి,మండల పరిషత్తు ఉపాధ్యక్షులు పులగం బులిరెడ్డి, బిక్కవోలు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, కుతుకులూరు కొప్పవరం గ్రామ సర్పంచ్ లు గొల్ల హేమ తులసి, కర్రి బులిమోహన్ రెడ్డి, ఉప సర్పంచులు సబ్బెళ్ళ నాగిరెడ్డి సత్తి సూరారెడ్డి సురేష్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సభ్యులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర ప్రారంభించిన ఎంపీపీ కార్చెర్ల



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా గ్రామ వార్డ్ సచివాలయాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మే 26వ తేదీ మంగళవారం పెరవలి మండల పరిషత్ అధ్యక్షులు కార్చెర్ల సీతారామ ప్రసాద్ మరియు మండల ప్రత్యేక అధికారి ఎన్ వి వి ఎస్ మూర్తి , ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వారిచే ఖండవల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల నందు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ,ఖోఖో , బ్యాడ్మింటన్డబుల్స్ లలోపండుగ వాతావరణంలో క్రీడా సంబరాలు ప్రారంభ మైనాయి, ఈ టోర్నమెంట్ నేటి నుండి 10 ఫిబ్రవరి 2024 వరకు 47 రోజుల పాటు జరుగుతాయి అని ఎంపిడిఓ ఎస్ రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమము లో పిఈటి మాస్టర్ ఎమ్.పల్లపు రాజు, పంచాయతీ కార్యదర్శి ఆకుల లక్ష్మినారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఏ వేణు గోపాల రావు, సచివాలయం సిబ్బంది, ఆటలు లో పాల్గొనే వారు హాజరు అయినారు.

## వంగవీటి మోహన రంగాకు ఘనంగా నివాళులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు, కాకినాడ సిటీ ఇంచార్జ ముత్తా శశిధర్ మరియు సిటి అధ్యక్షులు తోట సుధీర్ వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నివాళులు అర్పించడం జరిగింది. 44వ డివిజన్ శారదా దేవి గుడి ప్రాంతంలో అగ్రహారపు సతీష్ ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల తరపున పోరాడటానికి ఆయన ఏనాడు ఆలోచించలేదన్నారు. పిలిచినది ఏవరైనా పలికేవారనీ అందుకే ఇన్ని దశాబ్దాలు అయినా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని కొనియాడారు. పోరాడటం అంటే ఆయన నుండే నేర్చుకోవాలనీ, స్పూర్తిని మనమందరం మరువకూడదని జోహార్లు అర్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ సిటీ జనసేన పార్టీ అధ్యక్షులు తోట సుధీర్ మాట్లాడుతూ రంగా అంటే ఒక అలుపెరగని కెరటం అనీ, తన లక్ష్యంకోసం ప్రాణాలను సైతం లెక్కచేయలేదని అన్నారు.

## అద్వాన్నంగా కూనవరం పడవ రేవు



**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం గ్రామపంచాయతీకి భారీ ఆదాయం తెచ్చిపెట్టే కూనవరం రుద్రంకోటరేవు అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తుంది. గత సంవత్సరం కూనవరం రుద్రమకోట ఫెర్రీ వేలంలో 36 లక్షల రూపాయలు ఆదాయం సమకూర్చి పెట్టింది రుద్రమ్మకోటకు కూనవరం పంచాయతీకి సమానంగా ఒక్కొక్క పంచాయతీకి 18 లక్షల రూపాయల వరకు ఆదాయం సమకూరింది అయినప్పటికీ పడవ రేవు వద్ద ఉన్న మెట్ల దారిని నిర్మాణం చేపట్టడంలో పంచాయతీరాజ్ శాఖ విఫలం అయింది ప్రతిరోజు వందల మంది ప్రయాణికులు రుద్రమ్మకోట కూనవరం పడవ ప్రయాణం చేస్తూనే ఉంటారు సాయిబాబా గుడి దగ్గర నుండి పడవకు వెళ్లే రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉంది రహదారి నిర్మాణం కోసం అధికారులు స్పందించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గొల్లప్రోలులో ఎమ్మెల్యే దొరబాబు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ పరిధి కొత్తపేట రామాలయం 15వ వార్డులో మంగళవారం కౌన్సిలర్ గంట అప్పలస్వామి ఆధ్వర్యంలో కార్యకర్తలతో పల్లపూవీధి రామ లయంలో పిఠాపురం శాసనసభ్యులు పెండెం దొరబాబు స్వామివారిని దర్శించుకుని అనంతరం 10.లక్షల రూపాయల ప్రభుత్వం నిధులతో రామాలయం కొరకు కమ్యూనిటీ హాలుకు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక బాయ్స్ హై స్కూల్‌లో ఈరోజు మంగళవారం ఉదయం 10 గంటలకు ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు రిబ్బన్ కట్ చేసి క్రీడను ప్రారంభించారు అనంతరం మార్చి నెలలో రిటైర్ అవుతున్న ఉపాధ్యాయురాలను శాలువా గప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాల్గొన్న వైయస్సార్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు మొగలియ్యారావు విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు జ్యోతుల బీముడు పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మొగలి బాబ్జి 17వ వార్డు కౌన్సిలర్ గండేటి రాము 15వ వార్డు కౌన్సిలర్ గంట అప్పలస్వామి10. మొగలి దొరబాబు ఇలా పలువురు కౌన్సిలర్ లు ఉపాధ్యాయులు అధికారులు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'బహుమతిగా పచ్చని మొక్కలు' ప్రదర్శన



కాకినాడ, మేజర్ న్యూస్ : గాడ్స్ క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31, జనవరి ఒకటి, రెండు రోజుల పాటు స్థానిక వివేకానంద పార్కు సమీపాన 'బహుమతిగా పచ్చని మొక్కలు' అన్న నినాదంతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సుమన తెలిపారు. పర్యావరణ పరిరక్షణతోపాటు వాతావరణ కాలుష్య నివారణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ రెండు రోజులపాటు నిర్వహించే ప్రదర్శనలో క్రోటన్, బోన్‌సాయి, మెడికల్ మరియు ఎయిర్ ప్యూరిఫై మొదలగు అన్ని రకాల మొక్కలు ఉంటాయని, వ్యాపార లక్షణం అనే ఆలోచన కాకుండా సామాజిక బాధ్యతగా తక్కువ వ్యయానికి మొక్కలను అందజేయబడుతుందని వివరించారు. బహుమతిగా పచ్చని మొక్కలు అనే ఆలోచనతో 2018లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ వినూత్న ప్రయోగం గత ఐదు సంవత్సరాలలో మంచి ఫలితాలు ఇచ్చాయని ఆమె తెలిపారు. విశేష సందర్భాలలో ఇచ్చే పుష్పగుచ్ఛాలు తాత్కాలికంగా ఉంటాయని, బహుమతిగా ఇచ్చే మొక్కలు బహుళ ప్రయోజనాలను కలిగి ఉండడమే కాక అలంకారప్రాయంగాను, అందంగానూ ఉంటాయని ఆమె వివరించారు. ఈ రెండు రోజుల ప్రదర్శనను సందర్శించవలసిందిగా ఆమె విజ్ఞప్తిచేశారు. ఇతర వివరాలకు 9133297388 లో సంప్రదించవచ్చని ఆమె అన్నారు.కాకినాడలో తొలిసారిగా 'బహుమతిగా పచ్చని మొక్కలు' అనే నినాదంతో ప్రారంభించామని, మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బహుమతులుగా మొక్కలు ఇవ్వడం ద్వారా పిల్లల్లోనూ మొక్కలు పెంచాలన్న అభిరుచి కల్పించడమే లక్ష్యమని ఆమె వివరించారు. అన్ని ప్రాంతాలలో ఉన్న మహిళలకు తమ సంస్థ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా సలహాలు సూచనల ద్వారా అందిస్తున్నామని ఆమె అన్నారు. ఈ రెండు రోజుల ప్రదర్శనను విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## అడుగడుగునా అవినీతి





**కాకినాడ, మేజర్ న్యూస్ :** గర్భిణీలకు ఇచ్చే పాల నుండీ స్కూలు పిల్లలకు ఇస్తున్న స్కూలు బ్యాగులు, షూల వరకూ సమస్తం చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమ మార్గంలో అవినీతికి పాల్పడుతున్నారంటూ పలువురు జనసేన నాయకులు రాష్ట్రంలో వైకాపా పాలనపై మండిపడ్డారు. కాకినాడ సిటీ జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు ముత్తా శశిధర్ ఆదేశాలతో 'నాదెండ్ల మనోహర్ గారి మాట కాకినాడ సిటీలో అందరి నోట' కార్యక్రమం జనసేన పార్టీ రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ మరియు కార్మిక నాయకులు దుగ్గన బాబీల ఆధ్వర్యంలో జగన్నాధపురం విష్ణాలయం ప్రాంతంలోను మరియు 41వ డివిజన్ వాసిరెడ్డి సత్య కుమార్ ఆధ్వర్యంలోను మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా జనసేన పార్టీ శ్రేణులు ఈ ప్రాంత ప్రజలకు నేటి ఈ వై.సి.పి ప్రభుత్వం చేస్తున్న అవినీతి కార్యక్రమాల చిట్టాని విశదీకరించారు. గర్భిణీలకు ఇచ్చే పాల నుండీ స్కూలు పిల్లలకు ఇస్తున్న స్కూలు బ్యాగులు, షూల వరకూ సమస్తం చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమ మార్గంలో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఆమ్యామ్యాల ప్రభుత్వం అని ప్రజలు పిలుచుకుంటున్నారన్నారు. ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన ఎంతటి ఘనమైనది అనంటే అనారోగ్యంతో ప్రజలు బాధపడుతూ సహాయం పొందే ఆరోగ్య రక్ష పథకం నుండి కూడా చేయని బిల్లులకు డబ్బులు నొల్లేస్తూ ప్రభుత్వ ఖజానాని ఖాళీచేస్తున్నారనీ అదికూడా అరికట్టని అక్రమాల చక్రవర్తి అన్నారు. కానీ ఉచితంగా ఇసుక ప్రజలకు ఇచ్చాడని గత ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రభుత్వానికి నష్టం చేసారని కేసులు పెడతారనీ, ఇదంతా చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందాన ప్రవర్తిస్తున్నాడని అనుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనువాస్, బడ్డి శివ, పాల్ రాజ్, గరగా శ్రీను, సతీష్, నగేష్, సంతోష్, దారకేష్, పురుషోత్తం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## మండల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఏర్పాటు



– అధ్యక్షునిగా ఎన్నికైన షేక్ ఇస్మాయిల్

**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి మండల పరిధిలోని అనపర్తి, పొలమూరు, రామవరం, పీరా రామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాలకు చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబాలు అనపర్తి మండల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రామాలకు చెందిన సుమారు 250 ముస్లిం కుటుంబాలు సంఘటితంగా సంఘ ఏర్పాట్లు పాల్గొన్నారు. తమ సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ఈ సంఘం ఏర్పాటు చేసినట్లు ముస్లిం పెద్దలు తెలియజేశారు. ఈ సంఘానికి అధ్యక్ష పదవికి ఎన్నిక ద్వారా అభ్యర్థిని ఎన్నుకోవడం జరిగిందని, ఐదుగురు సభ్యులు పోటీపడిన ఈ ఎన్నికలో షేక్ ఇస్మాయిల్ అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారని అన్నారు. ఈ సంఘానికి గౌరవ అధ్యక్షునిగా అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షులుగా షేక్ సల్మాన్(నాగూర్), షేక్ సిలార్ సాహెబ్, కార్యదర్శిగా షేక్ మాబూ సుభానీ, సంయుక్త కార్యదర్శులుగా షేక్ సూరా సాహెబ్, షేక్ మీరా సాహెబ్,కోశాధికారిగా షేక్ అమీర్ (దొర)లో మరో ఏడు మంది కార్యవర్గ సభ్యులుగా షేక్. దర్గా మదీనా ( షాకీర్) షేక్.ఫకీర్ ( ఎర్రవరం బాబ్జీ) షేక్.సుభాన్ (భీమవరం) షేక్ .మౌల షేక్.గౌస్, షేక్ సుభాని ( మల్లంపుడి ) షేక్ . మౌలాలి (పొలమూరు) నియమితులు అయినట్లు తెలిపారు. అధ్యక్షులు ఎన్నికైన షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని, తమ సామాజిక అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

# దత్తాత్రేయుని దర్శించుకున్న ఉదయ శ్రీనివాస్



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామంలో కొలువైయున్న దత్తాత్రేయుని మంగళవారం దత్త వేడుకల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తంగళ్ళ ఉదయ శ్రీనివాసు బరిశెట్టి ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే పెండెం దొరబాబు వన్నెపూడి సర్పంచ్ కంద సుబ్రమణ్యం మొగలియ్యారావుతో కలిసి దత్తాత్రేయుని దర్శించుకున్నారు. అలాగే కాకినాడ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి వంగా గీతా విశ్వనాథం అభిమానులతో మహిళలతో స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ పండితులు వీరికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు దీనిలో భాగంగా మాజీ ఎంపీపీ బవిరిశెట్టి రాంబాబు వందలాదిమంది జనసైనికులతో పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ళ ఉదయ శ్రీనివాస్ కు డాక్టర్ పిల్లా శ్రీధర్ కు స్వాగతం పలికి ఆహ్వానించారు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసును ప్రజలకు పరిచయం చేశారు. దీనిపై ఉదయ శ్రీనివాసు ప్రజలకు అభివాదం చేస్తూ ప్రతి ఒక్కరిని పలకరించారు. దీనిపై ప్రజలు ఆశీర్వాదాలు దీవెనలు ఉదయ్కి అందించారు వన్నెపూడి లో జన సైనికుల సందడి నెలకొంది యువకుడు ఉత్సాహవంతుడు జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాసు డాక్టర్ పిల్లాశ్రీధర్లు కలిసి జనసేన పార్టీ బలోపేతానికి కంకణ బదులుగా ప్రజల్లోకి దూసుకుపోతున్నారు అనంతరం వన్నెపూడి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ ఉదయ శ్రీనివాసు పాల్గొని మహిళలకు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు ఉదయ్ వెంట పి నక వెంకట్రావు కుంపట్ల నాగ సత్యనారాయణ సారి పిల్లి నాగేశ్వరరావు దొడ్డిపట్ల బాబి పర్ల రాజా తదితర బవిరిశెట్టి సైన్యం జనసేన పార్టీ అభిమానులు వీర మహిళలు ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ళ ఉదయ్ ఇలా ప్రసంగించారు ఈరోజు దత్త స్వామిని దర్శించుకుని జన సైనికులతో భక్తులతోనూ కలవడం మరి ఇంత ఆనందాన్ని ఉత్సాహాన్ని పొందుతున్నానని ఉదయ శ్రీనివాసు వెల్లడించారు.

## గ్యాస్ వినియోగదారులు ఇ-కెవైసి చేయించుకోవాలి

– శ్రీ గంగా హెచ్‌పి గ్యాస్ అధినేత 'తలాటం'



**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం గ్యాస్ సబ్సిడి పొందుతున్న వినియోగదారులందరూ తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించుకోవాలని శ్రీ గంగా హెచ్‌పి గ్యాస్ అధినేత తలాటం గంగాధర రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో తెలుపుతూ కేంద్ర గ్యాస్ సహజ వనరుల మంత్రిత్వ శాఖ నిబంధనలు మరియు హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్సిడి పొందుతున్న గ్యాస్ వినియోగదారులు తమ ఆధార్ కార్డులను గ్యాస్ కార్డులను ఏజెన్సీల వద్దకు తీసుకువచ్చి ఇ-కెవైసి చేయించుకోవాలని ఆయన సూచించారు. శ్రీ గంగా హెచ్‌పి గ్యాస్ పరిధిలోని డెలివరీ బాయ్‌లకు ఇ-కెవైసి మిషన్లు అందజేయడం జరిగిందని, వారు ఇళ్ళ వద్దకు వచ్చి గ్యాస్ వినియోగదారులతో ఇకెవైసి చేయించుకోవడం జరుగుతుందని, ఈ విషయాన్ని గ్యాస్ వినియోగదారులు గ్రహించి సహకరించాలని, అలాగే స్థానిక గ్యాస్ కంపెనీ నందు ఇకెవైసి చేయబడునని ఆయన తెలిపారు.

## సారా బట్టీలపై సెబ్ పోలీసుల దాడులు




**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సిఐ కె.వి.స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం డివిజన్ పరిధిలో గల గండేపల్లి మండలం, కె.గోపాలపురం గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న నిల్వ ఉంచిన 200 లీ. బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 25 లీ. నాటు సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ కె.వి.స్వామి తెలిపారు. అలాగే గండేపల్లి తహశీల్దార్ ఎదుట ఒక వ్యక్తిని హాజరుపరిచి, రూ.10వేలు జరిమానా కట్టించినట్లు సిఐ తెలిపారు. అంతేగాకుండా ఎవరైనా నాటు సారా అమ్మినా, తయారుచేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడులలో ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, సెబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ కంచాలతో అంగన్‌వాడీలు నిరసనగా



**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 15వ రోజు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా ఖాళీ కంచాలపై గరిటెలతో వాయిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టి.నాగమణి, దాడి బేబిలు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కారని, వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన కొర్కెలను తీర్చాలని ఆమె డిమాండ్ చేశారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమి పట్టనట్లు ఉందని, వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దాడి బేబి, పేపకాయల వీర విజయలక్ష్మి, రెడ్డి సీతారత్నం, అమల, నాగమణి, ఫాతిమా, ఎస్తేర్ రాణి, నాగరత్నం, కాలె దేవి, పద్మ, వరలక్ష్మి, జె.కుమారి, స్నేహలత, సావిత్రితో పాటు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు



పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, పండుగ సెలవులు, వారంతపు సెలవులు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా మంగళవారం పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెలో ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపురపు శ్రీనివాస్, వ(్రె గిరిబాబు, శేఖర్, చాపల శ్రీను, సింగంపల్లి సింహాచలం, సురేష్, రాజేష్, గంటా రమణ, బాసిన భద్రరావు, గంగాభవాని, నీలం నూకరత్నం, వ(్రె వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో వికసిత్ భారత్ ప్రచార యాత్ర



పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం, గుడివాడలో మంగళవారం ఇఓ & పిఆర్‌డి కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ ప్రచార యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుస్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. వికసిత్ భారత్ రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, బిజెపి నాయకులు విత్తనాల వెంకటరమణ, దుర్గా మోహన రావు, కరెడ్ల దేవి,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయి నుండి మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికితీయడం జరుగుతుంది

కొవ్వూరు, మేజర్‌న్యూస్ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయి నుండి మట్టిలో ఉన్న మాణిక్యాలను వెలికితీయడం జరుగుతుందని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలో కొవ్వూరు టౌన్ లోని ఇండోర్ స్టేడియం, మడంలం వేములూరులోని పొట్రు సోమరాజు, వెంపాటి నారాయణ దయానంద ఆంగ్లో వేదిక్ (డీఏవీ) స్కూల్ లో, పశివేదల గ్రామంలో ఆలపాటి బుల్లి గురవయ్య జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో, నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాలకు హోంమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మొదటిగా కొవ్వూరు టౌన్ లో కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులకు ఉత్సాహాన్ని నింపారు. కొవ్వూరు ఆర్డీవో అశుతోష్ శ్రీవాత్సవ, అసిస్టెంట్ కలెక్టర్(అండర్ ట్రైనింగ్) యశ్వంత్ రెడ్డితో నాయకులు, క్రీడాకారులతో బ్యాడ్మింటన్ ఆడారు. అనంతరం వేములూరులో డీఏవీ స్కూల్ లో విద్యార్థులతో కలిసి ఆడారు. అక్కడ బెలూన్స్ ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ పోటీల్లో 34 లక్షల మందికి పైగా క్రీడాకారులు పోటీపడనున్నారని తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి క్రీడా పోటీలు జరగలేదన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డిసెంబర్ 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 10వ తేది వరకూ మొత్తం 47 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా



కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇటీవల జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కొంతమంది విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించామని. అలాగే కొంతమంది సెల్ ఫోన్లకు అడిక్ట్ అయ్యారని గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువత అంతా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు శరీర ధృడత్వం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్రీడాకారుల జీవనశైలిలో మార్పులు వస్తాయన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబీల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ప్రముఖ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్యమున్న క్రీడలకు సంబంధించిన పోటీలు జరుగుతాయన్నారు. గ్రామ స్థాయి నుంచి యువత అంతా అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఇప్పటికే రూ.119 కోట్ల బడ్జెట్‌తో ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లను ప్రతి సచివాలయానికి ఇప్పటికే సరఫరా చేశామన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమని.. ఒక టీం గెలిస్తే మరో టీం ఓడిపోతుందన్నారు. అందరూ గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని భవిష్యత్ లో కూడా ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కూడా ఉన్నాయని.. వాటిని యువత వినియోగించుకోవాలని కోరారు. క్రీడాపోటీలను విజయవంతం చేయడంతో పాటు ఆడుదాం ఆంధ్రాలో కొవ్వూరు నియోజకవర్గానికి మంచి గుర్తింపు తీసుకొచ్చేవిధంగా క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులందరూ బాగా ఆడి.. తమ సత్తాను చాటి చెప్పాలని, ధైర్యంగా ఆడి విజేతలు కావాలని రాష్ట్ర యువత అంతటికీ హోంమంత్రి తానేటి వనిత 'ఆల్ ది బెస్ట్'అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, క్రీడాకారులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆడుదాం-ఆంధ్రా ఇది అందరి ఆట



పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం, వడ్లమూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో వాలీబాల్ క్రీడను ఆడుదాం-ఆంధ్రాలో భాగంగా వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కంటే వీరాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.అశోక్ కుమార్, కంటే వీరాఘవరావులు మాట్లాడుతూ యువతకు క్రీడల పట్ల ఆశక్తి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వాయిలేటి చిన్నారావు, పంచాయతీ సెక్రటరీ కళావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్, డిజిటల్ అసిస్టెంట్ వెంకన్నబాబు, వలంటీర్లు, క్రీడాకారులు, పిఇటిలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు దుప్పట్లు, జింబఖానాలు పంపిణి

– బిసి సంక్షేమాధికారిణి ఎన్.రాజేశ్వరి



పెద్దాపురం,రూరల్, మేజర్ న్యూస్ : చలితీవ్రత రోజురోజుకు పెరుగుతున్న కారంగా చలిని తట్టుకోవడానికి ప్రభుత్వ బిసి, ఎస్సీ, బాలుర బాలికల వసతి గృహాలలోని జిల్లాల్లో గల 27 ప్రీ మెట్రిక్ హాస్టల్స్ నందు విద్యార్థులకు దుప్పట్లు, క్రింద పరుచుకుని పడుకునేందుకు జింబఖానాలు ప్రభుత్వం పంపిణీ చేసిందని, బిసి సంక్షేమాధికారిణి ఎన్.రాజేశ్వరి తెలిపారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులకు రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రత దృష్ట్యా జిల్లాలో విద్యార్థులకు దుప్పట్లుతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటుచేసిన దోమతెరలను కూడా పంపిణి చేసినట్లు ఆమె తెలిపారు.

## ఛండీహోమంలో పాల్గొన్న భక్తులు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి పౌర్ణమి సందర్భంగా ఛండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకే ఆడుదాం-ఆంధ్రా



పెద్దాపురం,మేజర్‌న్యూస్: యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, పెద్దాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీలు పేర్కొన్నారు. మంగళవారం పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో వార్డు సచివాలయాల పరిధిలో క్రికెట్, టెన్నిస్ టోర్నమెంటు పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కమీషనర్ జె.సురేంద్ర, సిఐ రవికుమార్, తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, ఎస్సై వెలుగుల సురేష్, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు రగ్గులు, యువతకు వాలీబాల్ కిట్లు అందజేసిన ఏఎస్‌పి జగదీష్ అడహల్లి



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :మండలానికి చెందినపీటీ జి గిరిజ నులు దాకరాయి బాసర వీధి, తెల్ల కోన గూడెం గ్రామస్తులకు రగ్గులు, యువతకు వాలీబాల్ కిట్లుఏ ఎస్ పి జగదీష్ అడ్డహల్లి మంగళవారంపంపిణి చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఏఎస్పీ ఆధ్వర్యంలో34 మంది జీడి కానిస్టేబుల్ అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్ నుండి స్క్రీనింగ్ టెస్ట్‌లో మెరిట్ వచ్చిన ఏడుగురు అభ్యర్థులను తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని ఏ ఎస్ పికి యూనియన్ నాయకురాలు కే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సీఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సై వెంకయ్య, సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు ఉన్నారు.

## బిక్షాటన ద్వారా నిరసన తెలియజేసిన సమగ్రశిక్ష ఉద్యోగులు



కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యా శాఖలో పనిచేసే సర్వ శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలను తక్షణం చెల్లించాలని, జగన్ ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలియజేస్తూ జగన్ ఉద్యోగులపట్ల నిర్లక్షధోరణితో వ్యవహరించడం తగదని, తక్షణం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, మరింత ఉధృతంగా సమ్మె పోరాటం నిర్వహించాలని, ఇప్పటికే కరెంటు చార్జీలు పెంచుతూ, నిత్యవసరాలు ఆకాసాన్ని తాకుతుంటే, ఉద్యోగుల వేతనాలు ఎందుకు పెంచరని కొంతమంది ఉద్యోగులు తరుపున జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమానికి జేఏసీ జిల్లా అధ్యక్షులు ఎం.చంటిబాబు, జిల్లా కార్యదర్శి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఏ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్, రాధాకృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

## కోటలో ఆడుదాం ఆంధ్రా క్రీడ పోటీలు

– ప్రారంభించిన హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు



సామర్లకోట,మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను,యువతను ప్రోత్సహించేలా నిర్వహిస్తున్న ఆడదాం ఆంధ్ర పోటీలు సామర్లకోట జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయగా మంగళవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నేటి నుంచి పిబ్రవరి 10వ తేదీ వరకు సుమారు 47 రోజులు పాటు పండుగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుం దన్నారు.గ్రామాల్లోని ఆణిముత్యాలను దేశానికి అందిచాలని, యువతను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రారంభించిన హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు సరాదాగా క్రికెట్ ఆడారు. కాసేపు బ్యాటింగ్ చేసి అందరినీ అలరించారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

## స్వర్ణదేవాలయంలో వైభవంగా క్రిస్మస్ వేడుకలు



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి పెద్దాపురంలో స్థానిక లూథరన్ హైస్కూల్ ప్రక్కన గల స్వర్ణ దేవాలయం నందు వ్యవస్థాపకులు రెవ. డా.జి.ఆర్.ఇమ్మానుయేల్ రాజ్, శ్రీమతి జ్యోతిపుష్ప, పాస్టర్ జాన్‌మోజెస్‌దాస్‌ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

ఈ వేడుకలలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు దైవజనులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పురస్కరించుకుని రెవ. డా.జి.ఆర్.ఇమ్మానుయేల్ రాజ్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి శాంతియుత మార్గమని తెలియజేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి



కాకినాడ, మేజర్ న్యూస్ : ఆదిత్య డిగ్రీ కళాశాలలో బి బి ఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి నవీన్ కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర కళాశాలల పురుషుల ఫుట్బాల్ పోటీలు, ఎంపికలు ఎస్ ఎస్ ఆర్ జి సి పి ఈ , గోపన్నపాలెంలో జరిగాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జి నవీన్ కుమార్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో గోల్ కీపర్ గా ఎంపికయ్యాడని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సౌత్ జోన్ ఫుట్బాల్ టోర్నమెంట్ జరగనున్నది. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని సౌత్ జోన్ పోటీలలో విజయం సాధించి యూనివర్సిటీకి, కళాశాలకు పేరు తేవాలని అన్నారు. సౌత్ జోన్ ఫుట్బాల్ టోర్నమెంట్ కు గోల్ కీపర్ గా ఎంపికైన నవీన్ కుమార్ ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి రమేష్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, పి.డి ఉదయ్ , తదితర అధ్యాపకులు అభినందించారు.

# రోడ్ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

– ఏఎస్‌పి జగదీష్ ఆడహల్లి



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఏ ఎస్ పి జగదీష్ అడహల్లి అన్నారు. వార్షిక తనిఖీ లో భాగంగా రాజవొమ్మంగి విచ్చేసి రాజవొమ్మంగి స్టేషన్ రికార్డు లను తనిఖీ చేశారు.అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ రద్దీగా ఉండే చోట రోడ్డుపై వాహనతనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సిబ్బందినిఆదేశించామన్నారు. పోలీస్ స్టేషన్లో కేసులు తగ్గాయన్నారు. ఐడి యారక్, గంజాయి ట్రాన్స్పోర్ట్, విక్రయాలు జరగకుండా సిఐ ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి అవేర్నెస్ కల్పించాలని సూచించామన్నారు. రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు, ఐ టి డి ఏ ల ఆధ్వర్యంలో ఆదివాసి వీర్స్ పేరు మీద 75 మంది జి డి కానిస్టేబుల్ అభ్యర్థులకు ట్రైనింగ్ నిమిత్తం స్క్రీనింగ్ టెస్ట్ పెట్టడం జరిగిందన్నారు. ఆదివాసి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ కోరారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో మావోయిస్టు మూమెంట్ లేదని మావోయిస్టులు ఎదుర్కోవడానికిపోలీస్ తరపున యాక్టివ్గా ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతానికి మావోయిస్టులు ఉనికి లేదన్నారు. ఎన్నికల నిమిత్తం సమస్యాత్మక గ్రామాలు గుర్తించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రౌడీ షీటర్లు కొందరు మీద పాత కేసులు ఉన్నట్లు, వీరిలో మరణించిన వారిని తొలగిస్తున్నామన్నారు. దీనిపై రివ్యూ నిర్వహిస్తున్నట్లు ఏ ఎస్ పి తెలిపారు. సీఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సై ఎస్ వెంకయ్య ఉన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం



పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ : ఓటర్ల జాబితాలో ఓటర్ల గురించి అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి నమోదు చేసుకోవడం జరుగుతుందని ఈఆర్వో మరియు ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో తెలుపుతూ పెద్దాపురం నియోజకవర్గంలో ఓటర్లుగా చేర్చేందుకు అర్హతగా ఉన్నవారు ఫారం-6కు 144 ధరఖాస్తులు, మరణించినవారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఫారం-7కు 83 ధరఖాస్తులు మరియు ఓటర్ల జాబితాలో మార్పులు సవరణ కొరకు ఫారం-8కు 275 ధరఖాస్తులు వచ్చాయని సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తెలిపారు. గత వారంలో వచ్చిన చేర్పులు, తొలగింపులు, దిద్దుబాట్లు ఫారం-9, ఫారం-10, ఫారం-11, ఫారం-11ఎ, మరియు ఫారం-11బి లకు సంబంధించిన ధరఖాస్తులు మరియు క్లైములు, అభ్యంతరాలు (ఫారం-6, ఫారం-7, ఫారం-8) సంబంధించి క్లైములు వెంటనే ఆన్‌లైన్ చేసి, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎఈఆర్వో మరియు సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఓటర్ జాబితా నందు సవరణ ప్రక్రియ సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధుల యొక్క సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జడ్పిటిసి గవరసాన సూరిబాబు(వైకాపా), రంధి సత్యనారాయణ (టిడిపి అధ్యక్షులు), పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వోలు వజ్రపు జితేంద్ర, జె.సురేంద్ర, సామర్లకోట మున్సిపల్ కమీషనర్ రామారావు, తహాశీల్దార్ ఎస్.ఎల్.ఎన్.కుమారి, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, టిపిఓ చింతా ఫణికుమార్, ఆర్వో వి.చంద్రశేఖరం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# గోకవరంలో ఆడుదాం ఆంధ్ర..

- జడ్పిటిసి ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభం
- కబడ్డీ ఆటలు ఆడిన వైసీపీ నాయకులు
- అందరికీ ఆనందాన్నిచ్చిన ఆడుతాం ఆంధ్ర



గోకవరం, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని మంగళవారం మొదటి రోజు ఎంపీపీ జడ్పిటిసి చేతుల మీదుగా ఆటలు ప్రారంభించారు. ముందుగా జడ్పిటిసి ఎంపీపీలు వైసిపి నాయకులు కలిసి కబాడీ ఆడారు. మండలంలో అన్ని సచివాలయ పరిధిలో కార్యక్రమాలు డిసెంబర్ 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. గోకవరంలో నాలుగు గ్రౌండ్లను ఏర్పాటు చేసి ప్రతి సచివాలయం పరిధిలో మహిళలు మగవారు ఆదే విధంగా ఐదు గేమ్స్ లను రూపొందించారు. ఆడే గేమ్స్ ను బట్టి గెలుపొందిన విజేతలకు మంచి బహుమతులు కూడా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గేమ్స్ తో మాకెంతో ఆనందంగా ఉందని మానసిక ఒత్తిడి కూడా ఆటలు ఆడేటప్పుడు మర్చిపోతున్నామని తెలిపారు. పోటీలో 15 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు పాల్గొన వచ్చని అధికారులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆటల పోటీలు జరుగుతాయని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. గోకవరం గ్రామంలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్ సర్పంచ్ కొమరం శ్రావణి ఎక్స్ ఎంపీటీసీ సభ్యులు బుజ్జి ఎంపీటీసీ సభ్యులు రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ మడికి మైనర్ బాబు ఎండిఓ పిడి సచివాల సిబ్బంది పంచాయతీ ఈవో గారు పాల్గొన్నారు